సాక్షి పార్వతీపురం మన్యం

ఆదివారం | 29 | అక్టోబర్ | 2023



ఉత్సవ కోట.. హుకుంపేట

విజయనగరం రాజుల ఆడపడుచు పైడితల్లి అమ్మవారు తొలుత గ్రామదేవతగా పూజలందుకునేవారు. - 8లో



రెడ్‌క్రాస్ వలంటీర్లుగా చేరండి

ప్రతి ఒక్కరూ రెడ్‌క్రాస్ వలంటీర్లుగా చేరి, సమాజ సేవకు ముందుకు రావాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. - 8లో



తప్పిన ఘోర ప్రమాదం

తెర్లాం జంక్షన్‌లో శనివారం తెల్లవారుజామున రాజాం నుంచి రామభద్రపురం వైపు వస్తున్న రెండు లారీలు స్పీడ్ బ్రేకర్ల వద్ద ఢీకొన్నాయి. - 8లో

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: సీతంపేట ప్రభుత్వ ఐటీఐలో స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్, సూయింగ్ మెషీన్ ఆపరేటింగ్, డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, ఏసీ మెకానిక్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. వచ్చే నెల 4వ తేదీలోగా స్థానిక ఐటీఐలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7993795796 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

హెచ్‌ఎంలతో వెబెక్స్ మీటింగ్

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న 47 ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలతో శనివారం ట్రైబుల్ వెల్ఫేర్ రాష్ట్ర డైరెక్టర్, కమిషనర్‌లు వెబెక్స్ మీటింగ్ నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో మంజూరైన పోస్టులు ఎన్ని, ఎంత మంది పని చేస్తున్నారు, దీనిలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న వారి సంఖ్యను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కేడర్ స్ట్రెంత్ వివరాలు అడిగారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మంగవేణి, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, సీఎంఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ విజిలెన్స్ వారోత్సవాలు

విజయనగరం టౌన్: బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు పారదర్శకమైన, మెరుగైన సేవలందించే లక్ష్యంతో ఈ నెల 30 నుంచి నవంబరు 5వ తేదీ వరకూ విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు బీఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ జె.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం, మన్యం జిల్లాల్లో ఆయా కార్యాలయాల ఆవరణలో వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 08942-226700, 9441668789 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రామాలయం మూసివేత

- గ్రహణం ఎఫెక్ట్



రామతీర్థం దేవస్థాన ప్రధాన ద్వారాన్ని మూసివేసిన అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానాన్ని ఆలయ అర్చకులు శనివారం సాయంత్రం మూసివేశారు. పాక్షిక చంద్రగ్రహణం కారణంగా ఆలయంలో శ్రీ సీతారామస్వామికి రాత్రి ఆరాధన, పవళింపు సేవ నిర్వహించిన అనంతరం దేవాలయం ప్రధాన తలుపులను మూసివేశారు. గ్రహణం అనంతరం ఆదివారం వేకువజామున దేవాలయాన్ని తెరిచి స్వామికి సంప్రోక్షణ, బాలభోగం కార్యక్రమాలు జరిపిస్తామని అర్చకులు తెలిపారు. అనంతరం భక్తుల దర్శనాలకు అనుమతిస్తామన్నారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, పవన్, తదితరులు పాల్గొన్నారు.


రేపటి 'జగనన్నకు చెబుదాం' రద్దు

విజయనగరం అర్బన్: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా ఈ నెల 30న సోమవారం రద్దు చేసినట్లు డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినతిదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ వేడుకలు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నవంబర్ 1న కలెక్టరేట్ ఆడిటోరియంలో వేడుకలు నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించడం, జాతీయ పతాకాన్ని ఎగురవేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి జిల్లా అధికారులు, వారి సిబ్బందితో కలసి తప్పక హాజరు కావాలని కోరారు.

సాధారణ భక్తుల దర్శనానికి పెద్దపీట





అమ్మవారి జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఆలయ ఈఓ సుధారాణి తదితరులు

- భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు
- ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకే అధిక ప్రాధాన్యత
- సోమవారం తొలేళ్ల రోజునే ప్రముఖుల దర్శనాలు పూర్తి చేసుకునేలా చర్యలు
- నిర్ణీత సమయానికి సిరిమాను సంబరం పూర్తయ్యేలా చర్యలు
- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవంలో సాధారణ భక్తుల దర్శనానికి పెద్ద పీట వేసేలా, ఎటువంటి అసౌకర్యాలకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవ జాతర ఏర్పాట్లను పరిశీలించే నిమిత్తం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ఆలయం పరిసర ప్రాంతాలను పరిశీలించి రెవెన్యూ, దేవదాయ, పోలీసు అధికారులతో ఏర్పాట్లపై చర్చించారు. ఆలయంలోకి భక్తులు క్యూలైన్ల ద్వారా ప్రవేశం దర్శనానంతరం తిరిగి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ప్రముఖులు ఆలయంలోకి ప్రవేశించే ద్వారం వద్ద ఏర్పాట్లు, ఈ మార్గంలో ప్రవేశాలు నియంత్రించేందుకు చేస్తున్న ఏర్పాట్లపై ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ ప్రతి ఏడాది ఘనంగా జరుపుకునే కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి ఉత్సవాలను అందరి సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఉద్దేశంతోనే ప్రముఖులను సోమవారంనాడే దర్శనాలు పూర్తి చేసుకోవాలని ఇప్పటికే విన్నవించటం జరిగిందన్నారు. తాను కూడా తొలేళ్ల ఉత్సవం నిర్వహించే సోమవారం నాడే దర్శనం చేసుకుంటానని, సాధ్యమైనంత వరకు మిగిలిన వారంతా అదే రోజు దర్శనాలు చేసుకోవాలని కోరుతున్నట్టు పేర్కొన్నారు. సాధారణ భక్తుల దర్శనాలకు వీలుగా సిరిమాను ఉత్సవం జరిగే మంగళవారం రోజు ప్రముఖుల తాకిడి లేకుండా చూసేందుకే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పండుగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను కోరామన్నారు. పైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓ సుధారాణి, కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు, ఆర్‌డీఓ ఎం.వి.సూర్యకళ, డీఎస్పీ గోవిందరావు, ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి తరలిరండి : ఈఓ



కెఎల్.సుధారాణి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలలో కీలక ఘట్టమైన సిరిమానోత్సవానికి భక్తులు తరలిరావాలని ఆలయ ఈఓ కేఎల్ సుధారాణి కోరారు. శనివారం ఆమె 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. అందరి సహకారంతో గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిర్ణీత సమయంలోగా సిరిమాను తిరిగేలా చర్యలు చేపట్టామన్నారు. ఘటాలు తెచ్చేవారికి, దివ్యాంగులకు, వయో వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. రూ.50, 300 టికెట్లు అందుబాటులో ఉంచామన్నారు. జాతరలో సేవలకు ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నామని చెప్పారు. భక్తులు కోరే ప్రసాదాల కోసం గతం కంటే ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వం తరఫున మంత్రి కొట్టు సత్యనారాయణ అమ్మవారికి పట్టు వస్త్రాలను ఈ నెల 31న సిరిమానోత్సవం రోజున సమర్పిస్తారని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఇప్పటికే అమ్మవారికి పట్టు వస్త్రాలు పంపించిందన్నారు. తొలేళ్లు, సిరిమానోత్సవం రోజున పైడితల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు దేవదాయ శాఖ రూ.300ల ప్రత్యేక టికెట్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. టికెట్లు మూడు లాంతర్లు వద్ద నున్న చదురు గుడి, న్యూపూర్ణ థియేటర్ వద్ద నున్న కెనరా బ్యాంక్, ఫూల్‌బాగ్ కెనరా బ్యాంక్ బ్రాంచ్‌లలో లభ్యమవుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది మూడు వేల టికెట్లు విక్రయించేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ టికెట్లపై తొలేళ్ల రోజు సోమవారం ఉదయం 11 గంటల నుంచి మంగళవారం ఉదయం ఆరు గంటల వరకు మాత్రమే దర్శనం కల్పిస్తామని, భక్తులు దీన్ని గమనించి సహకరించాలని ఈఓ సుధారాణి కోరారు.

మధ్యాహ్నం 3 గంటలకే రథోత్సవం ప్రారంభం కావాలి : ఆర్‌డీఓ



మాట్లాడుతున్న ఆర్‌డీఓ సూర్యకళ

విజయనగరం అర్బన్: పైడితల్లి అమ్మవారి రథోత్సవం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకే ప్రారంభించేలా చూడాలని ఆర్‌డీఓ సూర్యకళ అన్నారు. సమయపాలన పాటించాలని ముందుగానే అవసరమైన సామగ్రిని, కార్యకర్తలని సిద్ధం చేయాలని అన్నారు. శనివారం ఆర్‌డీఓ కార్యాలయంలో అమ్మవారి ఉత్సవాల నిర్వహణ, సిరమాను రథం, పాలధార, అంజలి రథం తదితర రథాల నిర్వహణపై సంబంధిత అధికారులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ రథాలన్నీ 11 గంటలకే ప్రారంభం కావాలని దారి పొడువునా భక్తుల పూజలు, మొక్కులు తీర్చుకుంటారని వారి ఆనవాయితీలను పాటిస్తూనే సమయానికి కదిలేలా చూడాలని అన్నారు. మధ్యాహ్నం 12 గంటలకే అమ్మవారి గుడి వద్ద సిద్ధంగా ఉన్న రథాలన్నీ చేరుకోవాలన్నారు. సిరిమాను ఉత్సవంలో అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖ వారు సమన్వయంగా వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో పైడితల్లి దేవాలయం ఈఓ సుధారాణి, పూజారి బంటుపల్లి వెంకటరావు, పోలీస్, రెవెన్యూ అధికారులు, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

'యువజనోత్సవ' విజేతలకు బహుమతులు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: భారత ప్రభుత్వ జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా యువతలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పి ంచేందుకు యువజన ఉత్సవ కార్యక్రమం సెప్టెంబర్‌లో నిర్వహించింది. యువజన ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు జిల్లా స్థాయి 5కే రన్ – మారథాన్, జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో విజేతలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఎ.శ్యామ్‌కుమార్, డీఐఓ జగన్‌మోహన్‌రావు, జిల్లా విద్యాశాఖ డీఎం రామజ్యోతి చేతుల మీదుగా శనివారం సర్టిఫికెట్లు, ప్రైజ్ మనీ చెక్ రూపంలో పది మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సామాజిక చైతన్యం కలుగుతుందన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని వారు పేర్కొన్నారు. క్విజ్ పోటీల్లో మొదటి స్థానం పార్వతీపురం విద్యార్థులకు, 2వ స్థానం జియ్యమ్మవలస విద్యార్థులకు, 3వ స్థానం కొమరాడ విద్యార్థులకు, 4వ స్థానం గుమ్మలక్ష్మీపురం విద్యార్థులు గెలుపొందారు. 5కే రన్ విభాగంలో మొదటి స్థానం గుమ్మలక్ష్మీపురం ఐటీఐ విద్యార్థి బి.సోమేష్, 2వ స్థానంలో పార్వతీపురం జూనియర్ కళాశాల విద్యార్థి ఆర్.నాని గెలుపొందారు. వీరందరిని అధికారులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ, డిస్ట్రిక్ ఎకౌంట్ అసిస్టెంట్ పి.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి ఆలయం మూసివేత

- గ్రహణం ఎఫెక్ట్



మూసివున్న తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం

గరుగుబిల్లి: చంద్ర గ్రహణం కారణంగా తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాలను శనివారం సాయంత్రం 5 గంటల నుంచి మూసివేసినట్టు ఆలయ అర్చకులు వీవీ అప్పలాచార్యులు తెలిపారు. ఆదివారం ఉదయం చంద్ర గ్రహణం విడిచిపెట్టిన అనంతరం ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఉదయం 9.30 నుంచి భక్తులకు సర్వ దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- నవంబర్ 4వ తేదీన శ్రీకాకుళంలో...
- నవంబర్ 5వ తేదీన విజయనగరంలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా ప్రముఖ సివిల్స్ ఫ్యాకల్టీ బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్ 1, 2 పరీక్షలపై అవగాహన కల్పించడం

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1, 2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1, 2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షి ఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికీ తెలిసిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత: ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్ 1, 2 పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సెల్: 89776 25795 నంబర్‌కు తమ పేరు, ఫోన్ నంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపగలరు.

అవగాహన సదస్సు తేదీ:

శ్రీకాకుళంలో
నవంబర్ 4, 2023(శనివారం)

విజయనగరంలో
నవంబర్ 5, 2023 (ఆదివారం)

వేదికలు:

సెమినార్ హాల్, శ్రీకాకుళం గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ (అటానమస్) ఫర్ ఉమెన్

హోటల్ ఆనంద్ గ్రాండ్ ఫోర్ట్, ఎ.జి.రోడ్డు, మూడులాంతర్ల జంక్షన్ దగ్గర, విజయనగరం

సమయం:

ఉదయం 09:30 నుంచి 12:30 వరకు

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 89776 25795

నాగులగూడలో సెల్ఫ్ లాక్‌డౌన్



నాగులగూడ గ్రామానికి రాకపోకలు నిలిపివేస్తూ గ్రామస్తులు అడ్డంగా వేసిన కంచె

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని నాగులగూడ గ్రామంలో గిరిజనులు సెల్ఫ్ లాక్‌డౌన్ ప్రకటించారు. శనివారం నుంచి గ్రామంలో వ్యక్తులు బయటకు వెళ్లడం, ఇతరులు గ్రామంలోకి రావడానికి లేకుండా గ్రామస్తులే ఇలా ప్రకటించుకున్నారు. దీనినే గిరిజన ఆచార సంప్రదాయాలు ప్రకారం గ్రామాన్ని కట్టడం అంటారు. గడిచిన రెండు నెలల్లో గ్రామంలో ముగ్గురు సాధారణంగానే తమ ప్రాణాలు విడిచారు. ఈ క్రమంలో గ్రామంలో శాంతి పూజలు చేయడానికి నిర్ణయించి ఈ లాక్‌డౌన్ ప్రకటించుకున్నారు. ఇకపై గ్రామానికి ఎటువంటి అపచారం జరగకూడదని, పితృదేవతలకు, గ్రామదేవతలకు జన్నోడు ఆధ్వర్యంలో గ్రామం చుట్టూ శాంతి పూజలు చేస్తున్నట్టు గిరిజనులు తెలిపారు. ఈ మూడు రోజుల పాటు గ్రామం నుంచి ఏ ఒక్కరూ బయటకు వెళ్లరు. అత్యవసర పరిస్థితుల్లో వెళ్తే మంచినీరు కూడా బయట తాగకూడదు. ఇంటికి సాయంత్రానికి చేరుకోవాలి. అలాగే గ్రామంలోకి కూడా ఇతరులు రాకూడదు అనే నిబంధన ఉంది. దీనిలో భాగంగా గ్రామం బయట కంచె వేశారు. ఇది తెలుసుకున్న తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తి, ఎంపీడీఓ కె.గీతాంజలి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి, డిప్యూటీ మాస్ మీడియా అధికారి వై.యోగీశ్వరరెడ్డి కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాన్ని సందర్శించారు. గిరిజనులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.


ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురం టౌన్: రామాయణ మహాగ్రంథాన్ని రచించిన మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణ కర్త వాల్మీకి బోయివాడిగా పుట్టి మహర్షిగా రూపాంతరం చెంది ఆదికవిగా గౌరవించబడ్డారని తెలిపారు. ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధురకావ్యం రామాయణమని, అటువంటి గొప్ప కావ్యాన్ని రచించి యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచే విధంగా సమాజానికి అందించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి అని అన్నారు. ప్రతీ ఒక్కరు వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని, రామాయణ స్ఫూర్తితో మానవత విలువలను పెంపొందించుకొని ధర్మబద్ధంగా జీవనం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డా. ఓ.దిలీప్‌కిరణ్, ఎస్‌బీ సీఐ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. పత్తి పంట సాగు చేస్తున్న ఏ ఒక్క రైతు నష్టపోకుండా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు విక్రయించేలా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాల మేరకు కొన్ని ప్రాంతాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్, జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి కె. శ్రీనుబాబు, ఎంపీఏ ఎం.శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి

అందరికీ అందుబాటులో ఇసుక... పారదర్శక విధానంలో ప్రభుత్వం నిర్దేశించిన ధరకే నాణ్యమైన ఇసుక...

పార్వతీపురం మన్యం జిల్లాలో నియోజకవర్గాల వారీగా రీజనబుల్ రవాణా ఛార్జీలతో కలిపి టన్నుకు ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక ధరల వివరాలు ప్రక్కన ప్రకటిస్తున్నాం. జిల్లాలో ఇంతకన్నా ఎక్కువ ధరకు ఎవరైనా మీమీ నియోజకవర్గాల్లో అమ్మితే SEB ఫోన్ నెంబర్ - 8977519109 కు ఫిర్యాదు చేయండి..

ఎవరైనా ఇంతకన్నా ఎక్కువ ధరకు అమ్మితే 2 లక్షల వరకు జరిమానా, 2 ఏళ్ల జైలు శిక్ష, రెండూ విధిస్తారు. అన్ని రీచ్‌ల వద్ద ఇసుక గరిష్ఠ అమ్మకపు ధర టన్నుకు రూ. 475/- మాత్రమే...

★ రాష్ట్రవ్యాప్తంగా ఇసుక మరింత తక్కువ ధరకు అందేలా అన్ని ఓపెన్ రీచ్‌లు అందుబాటులోకి వచ్చాయి..
★ ఇసుక బ్లాక్ మార్కెటింగ్, ట్రాన్స్ పోర్టర్ల సిండికేట్ లకు చెక్ పెడుతూ ఆన్ లైన్‌లో, ఆఫ్ లైన్ తో పాటు గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ఇసుక బుకింగ్ మరియు డోర్ డెలివరీ సదుపాయం..
★ www.andhrasand.com ద్వారా ఇసుక ఆన్‌లైన్ లో బుక్ చేసుకునే సదుపాయం కల్పించిన JPVL సంస్థ..
★ అందరికీ అందుబాటు ధరలో నాణ్యమైన ఇసుక పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం..

నియోజకవర్గం పేరు	టన్ను ఇసుక ధర
పాలకొండ	రూ. 580/-
కురుపాం	రూ. 775/-
పార్వతీపురం	రూ. 880/-
సాలూరు	రూ. 780/-

ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 14500

వినియోగదారుల కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 97000 09944

29-10-2023

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గనులు మరియు భూగర్భ శాఖ

శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్, అటవీ పర్యావరణం, సైన్స్ & టెక్నాలజీ, గనులు, భూగర్భ వనరుల శాఖామాత్యులు

క్లుప్తంగా

తప్పిన ఘోర ప్రమాదం



తెర్లాం జంక్షన్‌లో ఢీకొన్న లారీలు

తెర్లాం: తెర్లాం జంక్షన్ వద్ద శనివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం తప్పింది. రాజాం నుంచి రామభద్రపురం వైపు వస్తున్న రెండు లారీలు తెర్లాం జంక్షన్‌లో ఉన్న స్పీడ్ బ్రేకర్ల వద్ద ఢీకొన్నాయి. ముందు వెళ్తున్న లారీ స్పీడు బ్రేకర్ల వద్ద నెమ్మదిగా వెళ్లడంతో దాని వెనక నుంచి వస్తున్న మరో లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనకనుంచి వచ్చి ఢీకొన్న లారీ ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. పారాది వంతెన మరమ్మతులకు గురికావడంతో తెర్లాం మీదుగా భారీ వాహనాలు వెళ్తున్నాయి. రోడ్లు మరమ్మతులకు గురికావడంతో పాటు, ఇలాంటి చిన్నచిన్న ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

పీహెచ్‌సీ సిబ్బందిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం



కోనూరు పీహెచ్‌సీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

గుర్ల: కోనూరు పీహెచ్‌సీ సిబ్బంది తీరుపై డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని తాటిపూడి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. కోనూరు పీహెచ్‌సీ సిబ్బంది అంతా వైద్య శిబిరం వద్దనే ఉండడంతో అందరూ ఇక్కడే ఉంటే పీహెచ్‌సీకి వచ్చే రోగులను ఎవరు చూస్తారని మండిపడ్డారు. తీరు మార్చుకోవాలని సూచించారు. మరోసారి ఇదే పరిస్థితి పునరావృతమైతే చర్యలు తప్పవన్నారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

కొత్తవలస: అప్పుల బాధ తాళలేక రైల్వే ఉద్యోగి అర్జి రమణ(31) ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వీరభద్రపురం గ్రామంలో శనివారం జరిగింది. ఎస్‌ఐ హేమంత్ కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి.. విశాఖపట్నం జిల్లాలోని మర్రిపాలెంలో గ్యాంగ్‌మేన్‌గా పనిచేస్తున్న రమణ గత కొంతకాలంగా మద్యానికి బానిసై, అప్పుల పాలయ్యాడు. శుక్రవారం భార్య స్వాతితో కలిసి దేవరాపల్లి మండలంలోని కలిగట్లు గ్రామానికి అత్తవారింటికి వెళ్లి, ఆ రాత్రికి అక్కడే భార్య, పిల్లలను విడిచిపెట్టి స్వగ్రామమైన వీరభద్రపురానికి రమణ వచ్చాడు. శనివారం ఉదయం 10 గంటల సమయమైనా ఇంట్లో లైట్లు వేసి ఉండడాన్ని స్థానికులు చూసి, అతడి భార్యకు సమాచారం అందజేశారు. ఆమె ఇంటికి వచ్చి, తలుపులు పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని, మృతి చెందిన రమణను చూసి, విలపించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు శవపంచనామా అనంతరం ఎస్.కోట సీహెచ్‌సీకి పోస్టుమార్టం కోసం మృతదేహం తరలించారు. మృతుడి సోదరుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హేమంత్‌కుమార్ తెలిపారు. మృతునికి భార్య, ఐదేళ్ల లోపు వయసున్న కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ..

రామభద్రపురం: పురుగుమందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురై, బాడంగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సబ్బిరవరపు పెంటమ్మ(19) అనే యువతి శనివారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పాతరేగకు చెందిన పెంటమ్మ.. ప్రేమించిన వ్యక్తి నమ్మించి మోసం చేశాడన్న మనస్తాపంతో ఈ నెల 22వ తేదీన పురుగుమందు తాగి, ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడే చికిత్స పొందుతుండగా చనిపోయింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేంద్రనాయుడు తెలిపారు.

విజయనగరం మరింత సుందరం..


- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి జాతర కోసం మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరాన్ని సుందరీకరణ చేశామని, ప్రతి జంక్షన్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చెప్పారు. వీటి ఏర్పాట్లను ఆయన శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వరుసగా మూడు రోజుల పాటు నిర్వహించే విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి జాతరకు వచ్చే వారి కోసం మెగా మ్యూజికల్ నైట్, ఆనందోబ్రహ్మ వంటి వినోద కార్యక్రమాలు 13 వేదికల్లో ఏర్పాటు చేశామని, షాపింగ్ చేసేవారి కోసం అఖిల భారత డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాదాపు 200 స్టాల్స్ వివిధ రాష్ట్రాల నుంచి ఏర్పాటవుతున్నాయని చెప్పారు. ఆలయ అభివృద్ధి కోసం వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ షాపులను ఇచ్చేందుకు ముందుకు వచ్చారని, దీనివల్ల ఆలయాన్ని విస్తరించి క్యూలైన్లను అదనంగా ఏర్పాటుచేసే అవకాశం ఏర్పడిందన్నారు. పండుగ బాగా జరగాలన్నదే అందరి ఆలోచనగా వుందన్నారు. ఇందులో రాజకీయాలకు తావులేదని, తమ స్వార్థం ఏమీలేదని స్పష్టం చేశారు. నిర్ణీత సమయానికి సిరిమాను జాతర పూర్తయ్యేలా సహకరించాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నట్టు తెలిపారు.

ఉత్సవ కోట.. హుకుంపేట

- గ్రామదేవతగా పైడితల్లి అమ్మవారు
- పండగకు హుకుం జారీ చేసింది ఇక్కడే..
- తొలిపూజలు హుకుంపేటలోనే..
- నాటి పతివాడ పేట.. నేటి హుకుంపేట

విజయనగరం టౌన్: విజయనగరం రాజుల ఆడపడుచు పైడితల్లి అమ్మవారు తొలుత గ్రామదేవతగా పూజలందుకునేవారు. అమ్మవారికి మొదట్లో హుకుంపేటలోనే పూజలు నిర్వహించేవారు. చిన్నారి పైడితల్లి రాజుల ఆడపడుచుగా పతివాడ అప్పలనాయుడు సంరక్షణలో పెరిగింది. ఆ తర్వాత బొబ్బిలి యుద్ధంలో తన అన్న విజయ రామరాజును యుద్ధానికి వెళ్లవద్దని వారించినా, అన్నయ్య తన చెల్లి అయిన పైడితల్లి మాట వినకపోవడం, యుద్ధంలో మృతి చెందడం, ఆ విషయం తెలుసుకున్న పైడితల్లి పెద్దచెరువులో ప్రాణత్యాగం చేసుకోవడం విదితమే. కొద్దిరోజుల తర్వాత పతివాడ అప్పలనాయుడు కలలో కనిపించి, పెద్ద చెరువులో తన విగ్రహం లభ్యమవుతుందని, దానికి పూజలు చేయమని చెప్పడంతో అమ్మవారిని పెద్దచెరువులో నుంచి తీసి, వనంగుడి వద్ద ప్రతిష్ఠించారు. అయితే పతివాడ అప్పలనాయుడు నివాసముండే పతివాడపేట(నేటి హుకుంపేట)లోనే గ్రామదేవతగా అమ్మవారికి పూజలు చేసేవారు. ఆ తర్వాత కాలంలో నేటి రైల్వేస్టేషన్ దగ్గరున్న ఆ ప్రాంతమంతా దట్టమైన అరణ్యప్రాంతం కావడంతో అక్కడ ఉన్న చిన్న గుడికి తక్కువ సంఖ్యలో భక్తులు వచ్చేవారు. కాలక్రమేణా వనంగుడి వెలిసింది. అనంతరం కోట వద్ద చదురు నిర్మించి, అమ్మ వారిని ప్రతిష్ఠించారు. అయితే పురాతనమైన పతివాడపేటను నేడు హుకుంపేటగా పిలుస్తున్నారు.



హుకుంపేటగా పేరుగాంచిన నాటి పతివాడపేట

పతివాడపేటగా ఎలా మారింది..

ప్రస్తుతం ఉన్న హుకుంపేటను ఒకప్పుడు పతివాడపేటగా పిలిచేవారు. పతివాడ అప్పలనాయుడు కలలో అమ్మవారు కనిపించడం.. పతివాడపేటలో అమ్మవారు ఉన్న స్థలాన్ని నాయుడు చెప్పడంతో పైడితల్లి పండగ అక్కడి నుంచే ప్రారంభమైంది. దాదాపు 65 ఏళ్లకు పూర్వమే పతివాడపేటలో గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగ చాటింపు ఇంటింటికీ చేసేవారు. అదే సమయంలో వీధి పెద్దలంతా నాటి మహారాజుకు తెలియకుండానే చాటింపునకు హుకుం(ఆదేశాలు) జారీచేశారు. అప్పటి నుంచి పతివాడపేట కాస్త హుకుంపేటగా మారింది.

సిరిమాను అధిరోహించిన వారి వంశవృక్షం..

పైడితల్లి అమ్మవారు పతివాడ అప్పలనాయుడు కలలో కనిపించి, పూజలందుకుంటున్న దగ్గర నుంచి చూసుకుంటే స్థానిక పెద్దలు, పూజారి చెప్పిన వివరాల మేరకు పతివాడ అప్పలనాయుడు ఆయన కుమారుడు పతివాడ భోగినాయుడు సిరిమాను అధిరోహించారు. ఆయన కుమారులు పతివాడ సూర్యనారాయణ, పతివాడ లక్ష్మణనాయుడులు అధిరోహించారు. సూర్యనారాయణకు ఇద్దరు ఆడపిల్లలు ఉండడంతో పెద్దకుమార్తెను బంటుపల్లి సూర్యనారాయణనాయుడు వివాహం చేసుకున్నారు. ఆయన సిరిమాను అధిరోహించారు. అనంతరం ఆయన కుమారుడు బంటుపల్లి వెంకయ్యనాయుడు, తర్వాత బంటుపల్లి బైరాగినాయుడు సిరిమాను అధిరోహించారు. బైరాగినాయుడుకు ఒక ఏడాది ఆరోగ్యం సహకరించకపోవడంతో ఆయన మేనల్లుడు నేతేటి శ్రీనివాసరావు సిరిమాను అధిరోహించారు. తర్వాత మరలా బైరాగినాయుడే సిరిమాను ఎక్కారు. ఆయన తదనంతరం బైరాగినాయుడు మరో మేనల్లుడు తాళ్లపూడి భాస్కరరావు సిరిమాను అధిరోహించారు. ఆయన పదవీ విరమణ తర్వాత మళ్లీ బైరాగినాయుడు కుమారుడు బంటుపల్లి వెంకటరావు ప్రస్తుతం సిరిమాను అధిరోహిస్తున్నారు.

మూడు రోజుల పండగ..

వీధి పెద్దలంతా కలిసి సిరిమానోత్సవానికి కొన్ని నెలల ముందు హుకుంపేట రామాలయంలో సమావేశమై, పండగ విధి, విధానాలను ఖరారు చేస్తారు. దేవాదాయ శాఖకు సంబంధం లేని సమయంలో పూజారి ఇంట్లో మూడు రోజుల పండగ మాత్రమే చేసేవారు. ప్రస్తుతం అది కాస్త నెలరోజుల పండగగా నిర్వహిస్తున్నారు. 1980 సమయంలో బంటుపల్లి వెంకయ్యనాయుడు(బైరాగినాయుడు తండ్రి) సిరిమానును అధిరోహించారు. ఆ తర్వాత సిరిమానును అధిరోహించేందుకు సరైన వ్యక్తి అందుబాటులో లేకపోవడంతో కొత్తవలస నుంచి వెంకయ్యనాయుడు మేనల్లుడుని తీసుకువచ్చి, సిరిమానును అధిరోహింపజేశారు. ఆ తర్వాత 1990 దశకంలో నేతేటి నారాయణప్పడు మూడేళ్ల పాటు సిరిమానును అధిరోహించారు. ఆయన తర్వాత 28 ఏళ్ల పాటు బంటుపల్లి బైరాగినాయుడు సిరిమాను ఎక్కి, అత్యధిక సార్లు సిరిమాను అధిరోహించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. అనంతరం నేతేటి శ్రీనివాస్ సిరిమాను అధిరోహించారు. వారి తర్వాత తాళ్లపూడి భాస్కరరావు దాదాపు పదేళ్ల పాటు సిరిమానును అధిరోహించి, పదవీ విరమణ చేసి, కాలం చేశారు. ప్రస్తుతం దివంగత బంటుపల్లి బైరాగినాయుడు కుమారుడు బంటుపల్లి వెంకటరావు 2017 నుంచి సిరిమాను అధిరోహిస్తున్నారు. ప్రస్తుతం ఏడోసారి ఆయన సిరిమాను అధిరోహించనున్నారు.



సిరిమానుకు పూజలు చేస్తున్న భక్తులు

హుకుంపేటలో ఘటాలకే పూజలు..

అమ్మవారి పండగ వస్తుందంటే హుకుంపేట వాసులకు పండగే.. పండగ.. పండగకు ముందు మంగళవారం హుకుంపేటలో బాజాభజంత్రీలతో అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకోవడం ఆనవాయితీ. అందరూ చందాలు వేసుకుని మరీ భారీ ఊరేగింపుతో ఘటాలతో చదురుగుడికి, వనంగుడికి వెళ్లి, పూజలు చేస్తారు. పండగను అంగరంగ వైభవంగా నిర్వహించి, మొక్కుబడులు చెల్లిస్తారు. బంటుపల్లి వెంకటరావు ఇంటి వద్ద ఉన్న చదురు వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో ఘటాలు పెట్టి మొక్కుబడులు చెల్లిస్తారు.

ప్రతి ఒక్కరి పండగ..



పైడితల్లి పండగంటే ప్రతి ఒక్కరి పండగే.. ఒకప్పుడు గ్రామదేవతగా ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన పండగ నేడు రాష్ట్ర పండగగా గుర్తింపు రావడం మనందరి అదృష్టంగానే చెప్పాలి. జిల్లా వాసులందరూ ఈ పండగలో పాల్గొని, తల్లి దీవెనలు పొందాలి. చల్లనితల్లిగా అందరినీ కాపాడుతూ వస్తున్న అమ్మ పండగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నాం. –పతివాడ వెంకటరావు, స్థానికుడు

ఎవరి బాధ్యతలు వారివే...

సిరిమానోత్సవంలో ఎవరెవరు ఏం చేయాలో ముందుగానే నిర్ణయించుకుంటారు. అంజలిరథం ఊరేగింపు కోసం ఆడవేషధారణలతో ఐదు కుటుంబాల వ్యక్తులు పాల్గొంటారు. ఇందులో నడిపేన, గురుబిల్లి, మీసాల తదితర కుటుంబాలకు చెందిన వారు పాల్గొంటారు. తెల్లఏనుగు ఊరేగింపులో గంటలు వాయిస్తూ 900 మంది ఏనుగు రథంతో వచ్చి పూజలందిస్తారు. బెస్తవారి వల ఊరేగింపులో బెస్తవీధికి చెందిన 100 మంది జాలర్లు పసుపు రాసుకుని, అమ్మవారి వెనక నడుస్తారు. పాలధార ఊరేగింపులో సాకేటి వీధికి చెందిన వారు సాముగరిడీలు చేస్తారు. చినరామవరపు పైడిరాజు బృందం ఇందులో పాల్గొంటుంది.

పండగ మర్నాడు అన్నదానం..

సిరిమానోత్సవం పూర్తయిన మరునాడే హుకుంపేటలో పైడిమాంబ స్వచ్ఛంద సేవా సంస్థ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహిస్తారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నసమారాధన జరుగుతూనే ఉంటుంది. గ్రామపెద్దల సహాయ సహకారాలతో, దాతల విరాళాలతో అమ్మపండగను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

అమ్మ కోసం నిరీక్షణ..

హుకుంపేటలోని సిరిమాను కదిలిన క్షణం నుంచి పూజారి వీధుల్లో నడుస్తుండగా అందరూ ఆ తల్లి పాదాలను పసుపునీటితో కడిగి, నెత్తిన చల్లుకుంటారు. హారతులిచ్చి, అమ్మకు నీరాజనాలు పలుకుతారు. అమ్మ రాకను సూచిస్తూ డప్పు వాయిద్యకారులు ముందుగా వీధుల్లో చాటింపు వేస్తారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

- గంజాయి, సారా రవాణా, విక్రయాలను నివారించాలి
- సైబర్ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఆయన పోలీస్‌స్టేషన్‌లో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులపై సమీక్ష చేపట్టి, పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యచరణతో కేసులను త్వరగా దర్యాప్తు చేయాలన్నారు. గంజాయి, సారా రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాహన తనిఖీలు నిర్వహించి, బహిరంగ మద్యపానం, డ్రంక్ అండ్ డ్రైవ్ జరగకుండా చూడాలన్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా కోర్టుల్లో ట్రయల్‌కు వచ్చిన కేసులను స్టేషన్ ఎస్‌హెచ్‌వో, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌డివిజన్ పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు మార్కెటింగ్ చేసుకుంటూ ఉండాలన్నారు. కోర్టు వాయిదాలకు సాక్షులు సక్రమంగా హాజరై, న్యాయమూర్తి ఎదుట వాస్తవాలు ఒప్పుకునేలా ధైర్యం కల్పించాలన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసినంత మాత్రాన బాధితులకు న్యాయం జరిగినట్లు భావించకూడదని, నిందితుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటేనే బాధితులకు న్యాయం జరిగినట్టు అన్నారు. 174 సీఆర్‌పీసీ కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు చేసి, తప్పిపోయిన వారిని త్వరగా ట్రేస్ చేయాలన్నారు. అనంతరం ఓ హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా కృషి చేసిన పాచిపెంట కోర్టు కానిస్టేబుల్ రామ్మోహన్, కంప్యూటర్ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్ వి.రామాంబాబు, ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.సుజాత, కానిస్టేబుల్ శివకుమార్‌లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, దిశ డీఎస్పీ ఎస్.ఆర్.హర్షిత, పాలకొండ సబ్‌డివిజన్ డీఎస్పీ జి.వి.కృష్ణారావు, పార్వతీపురం డీఎస్పీ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా పూర్ణాహుతి

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకులైన ఉమా సదాశివాలయంలో మండల దీక్షలను పురస్కరించుకుని అర్చకులు మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో ముందుగా గణపతిపూజ నిర్వహించిన అనంతరం శివుడికి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. కామాక్షి అమ్మవారి సన్నిధిలో షోడశీ కళారాధన, శ్రీ చక్రార్చన చేపట్టారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కామాక్షి అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలు, పూజా సామాగ్రి సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మహా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

రెడ్‌క్రాస్ వలంటీర్లుగా చేరండి

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ప్రతి ఒక్కరూ రెడ్‌క్రాస్ వలంటీర్లుగా చేరి, సమాజ సేవకు ముందుకు రావాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. స్మార్ట్‌ఫోన్‌లో రెడ్‌క్రాస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, రిజిస్టర్ కావాలన్నారు. కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ కార్యనిర్వాహక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ వలంటీర్ల నమోదు విషయంలో మన జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలన్నారు. రెడ్‌క్రాస్ సభ్యులుగా చేరడమనేది సేవా తత్పరత, సమాజం పట్ల బాధ్యతకు నిదర్శనమన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకును రూ.65 లక్షలతో ఆధునీకరించడం జరుగుతుందన్నారు. అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు అంబులెన్సును సమకూర్చినట్లు తెలిపారు. చీపురుపల్లిలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ తరఫున కేన్సర్‌పై మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

డిసెంబరు నాటికి 10 లక్షల మంది..

ఇండియన్ రెడ్‌క్రాస్ ఏపీ శాఖ జనరల్ సెక్రటరీ ఎ.కె.పరీడా మాట్లాడుతూ సేవకు చిరునామాగా ఉన్న రెడ్‌క్రాస్ వలంటీర్ల నమోదు కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపడుతున్నామన్నారు. డిసెంబరు నాటికి రాష్ట్రంలో దాదాపు రూ.10 లక్షల మంది వలంటీర్లను చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రధానంగా ఏపీ రెడ్‌క్రాస్ యాప్‌ను పెద్దఎత్తున డౌన్‌లోడ్ చేయించి, దానిలో రిజిస్టర్ చేయించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా ఒక్క మన రాష్ట్రంలోనే యాప్ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు, వాతావరణ మార్పుల పట్ల రెడ్‌క్రాస్ యాప్ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, వేలాది మంది కార్మికులకు ప్రథమ చికిత్సలో శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ ఏపీ శాఖ చైర్మన్ ఎ.శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా పేదలకు, తలసేమియా, హెచ్‌ఐవీ, కేన్సర్ రోగులకు ఉచితంగా రక్తం అందిస్తున్నామన్నారు. కోవిడ్ సమయంలో విశేషమైన సేవలను అందించామన్నారు. వందేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ ర్యాలీ నిర్వహించామన్నారు. రాష్ట్రంలోని సుమారు 1.6 లక్షల మంది ఎన్‌సీసీ క్యాడెట్లతో త్వరలో ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, రెడ్‌క్రాస్ ఏపీ శాఖ వైస్ చైర్మన్ పి.జగన్‌మోహన్ రావు, కోశాధికారి సి.వెంకటేశ్వర రెడ్డి, జిల్లా చైర్మన్ కె.ఆర్.డి.ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఆర్డీవో ఎం.వి.సూర్యకళ, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు ఎస్.వి.సూర్యనారాయణ, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎటర్నటీ జట్టు



ట్రోఫీతో విజేత జట్టు సభ్యులు

విజయనగరం: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న క్రీడా సంబరాల్లో చేపట్టిన క్రికెట్ టోర్నీ పోటీల విజేతగా విజయనగరానికి చెందిన ఎటర్నటీ జట్టు నిలవగా..ద్వితీయ స్థానంలో విజయనగరం వారియర్స్, తృతీయ స్థానంలో విజ్జీ లయన్స్ జట్లు నిలిచాయి. నగరంలోని విజ్జీ స్టేడియంలో గత మూడు రోజులుగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు మొత్తం 11 జట్లు హాజరయ్యాయి. విజేతలుగా నిలిచిన జట్లకు మొదటి బహుమతి కింద రూ.15 వేలు, రెండో బహుమతి కింద రూ.10వేలు, మూడో బహుమతి కింద రూ.5 వేలతో పాటు ట్రోఫీలు, జ్ఞాపికలను సెట్విజ్ సీఈవో బి.రామ్‌గోపాల్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సిబ్బందితో పాటు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

విజయనగరం క్రైమ్: స్థానిక పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, మరికొంతమంది పోలీస్ అధికారులు కలిసి, వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం అదనపు ఎస్పీ వాల్మీకి, ఆయన రచనల గొప్పతనాన్ని కొనియాడారు. శ్రీరాముడి జీవితచరిత్రను రామాయణం వంటి మహాకావ్యంగా రాసి, మనకు అందించిన మహానుభావుడు వాల్మీకి అని, ఆయనను మనమంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్‌ఐలు ఎన్.గోపాలనాయుడు, రమణమూర్తి, ఎస్‌ఐ వాసుదేవ్, ఆర్‌ఎస్‌ఐలు శ్రీనివాసరావు, రామకృష్ణ, ప్రసాద్, నీలిమ, నారాయణరావు, కేశవరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉపఖజానా అధికారి కార్యాలయం మార్పు

విజయనగరం అర్బన్: తోటపాలెం ఇందిరానగర్ ప్రాంతంలో అద్దె భవనంలో ఉన్న ఉపఖజానా అధికారి విజయనగరం అర్బన్ కార్యాలయం మార్పు జరిగిందని జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఆర్.ఎ.ఎస్.కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరు బంగ్లా వెనక దండుమారమ్మ కోవెల దారిలోని జిల్లా ఆర్థిక కార్యకలాపాల భవన సముదాయానికి మార్చామన్నారు. పింఛన్‌దారులు చిరుమానా మార్పును గమనించాలని కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంటౌన్: కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సీతానగరం మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అదే గ్రామానికి చెందిన కొండమ్మకు వివాహమై, తొమ్మిదేళ్లు అయింది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా ఆమె తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. ఎప్పటిలాగే కడుపునొప్పి రాగా ఎప్పుడూ ఇలాగే జరుగుతోందని మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఉన్న చీమలమందు తాగి, ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి ఆమెను తరలించి, చికిత్స అందజేశారు. ఈ ఘటనపై ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలుశిక్ష

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2022లో నమోదైన మూడు దొంగతనాల కేసుల్లో నిందితుడు కడియాల రఘురామ్‌కు పది నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ విజయనగరం ఏజేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి బి.రమ్య తీర్పు వెల్లడించినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పట్టణ పరిధిలో జరిగిన దొంగతనాలకు సంబంధించి, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్‌ఐ వి.అశోక్‌కుమార్ కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. ఈక్రమంలో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, నేరారోపణలు రుజువు కావడంతో జైలు శిక్ష ఖరారు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఏపీపీగా రాజరాజేశ్వరి వాదనలు వినిపించారన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

బొబ్బిలి: మండలంలోని రంగరాయపురం దగ్గరున్న వేగావతి నది ఇసుక మేటల్లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు స్థానికుల ద్వారా పోలీసులు శనివారం గుర్తించారు. మృతుడి వివరాల కోసం ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, పట్టణంలోని రైల్వేస్టేషన్ జంక్షన్‌లో ఉన్న విజయలక్ష్మి మెస్‌లో పనిచేసే వంట మాస్టర్ వడ్డాది పోలారావు(37)గా గుర్తించారు. మృతుడిది పట్టణంలోని మహారాణిపేట దగ్గరున్న చిన్నచెరువు గట్టు ప్రాంతమని, ఈ వ్యక్తి ఎలా చనిపోయాడన్న విషయమై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు.

చికెన్	బ్రాయిలర్	లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
		₹120	₹210	₹220

సాక్షి సండే క్లాసిఫైడ్స్



CAR FOR SALE

■ Car for sale Maruti wegnor-Lxi life 2028 good running condition. contact 93477 81779. [S-1184630]

HOUSE FOR SALE

■ హౌస్ ఫర్ సేల్: సుజాతనగర్, పెందుర్తి (విశాఖపట్నం సిటీ)లో పడమర, దక్షిణం రోడ్ ఫేసింగ్‌తో ప్రైమ్‌లోకేషన్, 4 రోడ్ జంక్షన్‌లో కమర్షియల్ బిట్ 330చ॥గజములు గల ఇల్లు అమ్మబడును. సం॥ ✆ 9110542711(w.e), 91778 14567. [O-191647]

FLAT FOR SALE

■ 2 & 3 BHK Flats For Sale, East & North Facing Units, 30-32 Lakhs. Glass Lift, Security Cameras etc. Beside CMR Layout, Mudidam, 50m from Main Highway VZM. Ph : 96661 71000 [V-2190]

■ "0" Kms from SEZ Financial Dist, Gachibowli, Hyd. Luxury Gated Apartments, 2 / 3 / 4 BHK Flats for Sale. Near Google, Amazon etc., Ph : 9849025003. [HA-11785]

■ 2 BHK, S2, 950 Sft Sai Bhaskar Vihar, Ayyannapeta, Palnagar, Vizianagaram. Rs. 17 Lakhs Negotiable. Cont : 99123 35851 [V-2792]

PLOT FOR SALE

■ Plot for Sale Near Bhogapuram, Akkivaram Junction Plot Number E-182 166 Sq.yards Kohinoor Gateway Executive VUDA Approved Layout Developed by Building Blocks Company Bantupally Village. Ph : 77020 01857, 77299 33106 [V-2192]

BUSINESS OFFER

■ Swastika Services Pvt. Ltd. కంపెనీలో పనిచేయుటకు Male/Female ఏజెంట్స్ కావలెను. Qul:10th Class, మంచి జీతం+ Incentives. సంప్ర: 8267820117. [T-1200098]

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. Ph: 9310515624, 8800496710 [HA-41758]

■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact: for more info: 9381799124 [H-193263]

WANTED

■ ఉత్సాహవంతులైన 35సం॥ల లోపు యువకులు ఇంటర్నెట్, డిష్‌లు ఫిట్ చేసే అనుభవం ఉండి ఎలక్ట్రికల్ వర్క్‌లో టచ్ వుండి, సొంత 2వీలర్, లైసెన్స్, స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు సంప్రదించండి. సెల్: 63056 21618 [S-1184629]

■ రామకృష్ణ హోంకేర్ సర్వీస్: VJA, HYD శ్రీమంతుల ఇళ్లలో వృద్ధులసేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15-21 వేల. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 8639756217, 8639756214 [B-1068135]

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1206681]

■ Wanted Female Bank Staff For Operations Manager / Receptionist / Computer Opetator / Digital Marketing Manager / Recrutment Manager. Age : 19 to 25 yrs. Qlf : Graduation / B.Arch or post Graduation in any stream. Salary : 15k to 25k. Freshers can also Apply. Free Training Accommodation will be provide. Mail id : vizagbankretailasset centre@gmail.com. Ph : 93914 51032 [V-797345]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221789]

■ శ్రీరామ్ గ్రూప్‌లో ఉద్యోగ అవకాశాలు : మండలాల (S. కోట, కొత్తవలస, వేపాడ) వారీగా B.D.Eలు కావలెను. Sal : 15k to 20k. Any డిగ్రీ. Age : 25 to 35yrs. ఫోన్ : 96663 31353 [V-5948]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వంట/ఇంటి పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 20K, ఫోన్: 8977639662, 8977639663 [HA-765]

■ కష్టపడ్డే కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ:15000-40000/-ఫ్రీ రూమ్+భోజనం. Hyd, Ph: 8919613984 [HA-775]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788378]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి వంట మనుషులు, వార్డ్ బాయ్స్, ఆయాలు, భార్యాభర్తలు, గార్డెన్ పని & ఆవులు చూసుకొనుటకు వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-12454]

■ ఒక ప్రముఖ సర్వే సంస్థలో తెలంగాణ ఎలక్షన్ క్యాంపెయిన్ & సర్వే చేయుటకు రాజకీయ అవగాహన కలిగిన వెండార్స్ (500+టీం మెంబర్స్) కావలెను. ఫోన్ : 7396856819, 7386886819 [HA-1343]

■ MS కంపెనీ నందు టెలికాలర్స్ గా పనిచేయుటకు పార్ట్ టైమ్/ఫుల్ టైమ్, మేల్/ఫీమేల్ వెంటనే కావలెను. అర్హత: 10th, జీతం: 16,000 నుండి 18,000 వరకు. ఫోన్ : 7416297427, 7032253968 [HA-783]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.